www.prajasakti.com

# ప్రజాశక్తి

శనివారం 9 నవంబర్ 2024

## గణతంత్ర దినోత్సవ వేడుకల శిబిరానికి పీలేరు విద్యార్థి

**ప్రజాశక్తి-పీలేరు:** 2025 జనవరి 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక శిబిరంలో పాల్గొనే అవకాశం పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వి.బాలాజీకి లభించింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ సన్నాహ శిబిరానికి తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావ డం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బాలాజీ ఈ శిబిరంలో శిక్షణ పొందడం ద్వారా అతను క్రమశిక్షణ, దేశసేవ, జాతీయ సేవల పట్ల మరింత అవగాహన పెంచుకోడానికి ఓ మంచి అవకాశమని అన్నారు. ఇది తమ కళాశాలకు కూడా ఎంతో గర్వకారణమని చెప్పారు. ఈ సన్నాహక శిబిరం నవంబర్ 17 నుండి 26 వరకు సికింద్రా బాద్‌లో జరుగనుందని, ఇందులో పాల్గొనేందుకు బాలాజీకి అవకాశం దక్కడం విశేషమని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ మాలేపాటి వెంకటరమణయ్య, ఇతర అధ్యాపకులు బాలాజీకి ప్రత్యేకంగా అభినందించారు.

బాలాజీని అభినందిస్తున్న ప్రిన్సిపల్

# మెడికల్ మాఫియా

- మందుల పేరుతో దోపిడీ
- పట్టని అధికారులు
- కమీషన్ల కోసం కొందరు అనైతిక పద్ధతులు
- స్థాయికి మించిన వైద్యంతో సామాన్యులకు చిక్కులు

**ప్రజాశక్తి-రాయచోటి**

సామాన్య మధ్యతరగతి ప్రజలు ఏదో ఒక అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లి వైద్యులకు జ్వరం అన్న వెంటనే రక్త పరీక్ష, గల్ల పరీక్ష, ఇతర పరీక్షలు చేయించుకుని రావాలంటూ సూచిస్థారు. ఇలా రాయించి వారు రెఫర్ చేసిన ల్యాబ్ మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. దీని వల్ల ఆ వైద్యునికి కొంత కమీషన్ కూడా వస్తుంది. ఇది ఇలా ఉంటే తీరా వైద్యం కోసం డాక్టర్ విలువైన మందులను రాసిచ్చి ఇది రెండు వారాలపాటు వాడాలంటూ రోగికి ఇస్తారు. జిల్లాల్లో 1,258 మందుల షాపులున్నాయి. రోగి మందుల దుకాణాలకు వెళ్తే అక్కడ మందులు ఇచ్చి మాత్రలు కత్తిరించి బిల్లు వేయకుండానే నోటి లెక్కలతో లెక్కలు వేసి డబ్బులు నిలువునా వసూలు చేస్తున్నారు. వారు ఎంత చెప్పితే అంత చెల్లించి మందులు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాశులు ఇవేమీ అడిగే పరిస్థితి ఎక్కడ లేదు. ఇలా చదువు రాని వారి నుండి ఇష్టారాజ్యంగా మెడికల్ మాఫియా పేరుతో ఇష్టారాజ్యాంగా మందులో రేట్లు పెంచి దోచుకుంటున్నారు. కొంతమంది ఏకంగా అనుమతులు లేకుండా వైద్యులే సొంతంగా మెడికల్ షాపులు పెట్టుకొని ఇంట్లో వారే ఆ మెడికల్ షాప్లో పనిచేస్తూ మరి దోచుకుంటున్న వైనం కూడా జిల్లాలో ఎక్కువగా ఉంది. మందుల షాపులో కచ్చితంగా బిఫార్మసీ చేసిన వారి సర్టిఫికెట్తో మందులు నిర్వహించాలి. పెత్తనం ఒకరిది అన్నట్లుగా బిఫార్మసీ పూర్తయిన మహిళ కానీ, అబ్బాయి కానీ వారి సర్టిఫికెట్లను తీసుకుని దుకాణం మందులు విక్రయాలు సాగిస్తున్నారు. మెడికల్ షాపులో ఇంటర్ ఫెయిల్ అయిన వారు కూడా పనిచేస్తూ డాక్టర్ ఇచ్చే ప్రిస్క్రిప్షన్ మందులు ఇస్తున్నారు. కొన్ని చోట్ల అర్ఎంపి, పిఎంపిలు కూడా మందులు అమ్ముతున్నారు. తక్కువ జీతానికి వచ్చే వారిని దుకాణాల్లో పెట్టుకొని వారి ద్వారా వ్యాపారాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా మందుల షాపులో పనిచేసే వారు కచ్చితంగా బిఎస్‌సి సమాన విద్య పూర్తి చేసిన వారిని మాత్రమే నియమించుకోవాలని . అంతంతో చదువుకున్న వారిని ల్యాబ్ టెక్నీషియన్ సహాయకులుగా పెట్టుకొని డబ్బులు దోచుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం మందుల ధరల పట్టికను కచ్చితంగా ఆయా దుకాణాలు వద్ద పొందుపరచాల్సి ఉంటుంది. ఏ ఒక్కరూ ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించిన పాపాన పోలేదు. రూపాయికి రూపాయి చొప్పున మందులమ్మి సొమ్ము చేసుకుంటు పుట్టగొడుగుల్లా మందుల షాపులు పెరిగిపోతున్నాయి. ఇలాంటి వారిపై సేల్ టాక్స్ అధికారులు కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుంటారు. జిల్లాలో వివిధ మండల, గ్రామీణ ప్రాంతాలలో కూడా రీజనల్ మెడికల్ ప్రాక్టీస్ అని బోర్డు పెట్టుకొని వైద్యం చేసేవారు ఎక్కువగా ఉన్నారు. అలాంటివారు వైద్య సేవలు చేస్తూ వారే సెలైన్ పెట్టడం, మందులు అమ్మడం, వంటివి కూడా చేస్తున్నారు. అటువంటి వారిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఔషధ తనిఖీ అధికారులు ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ, ఉన్నతాధికారులు మందులు షాపులపై ప్రత్యేక నిగా ఉంచి ధరల నియంత్రణకు కళ్లెం వేస్తారని పలువురు కోరుకుంటున్నారు.

**వైద్యోనారాయణో హరి.. అనేది నానుడి. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరం వచ్చినా చిన్నచిన్న జబ్బులు చేసినా స్థానిక ప్రయివేట్ వైద్యులే చికిత్స చేసి తక్కువ ఖర్చుతో ప్రాణాలను కాపాడేవారు. అందుకే వారిని ప్రజలు దేవుడితో సమానంగా భావించేవారు. కానీ రానురాను ఆ పరిస్థితి మారిపోతోంది. పల్లెలు, మారుమూల గ్రామాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని కొన్ని వీధులే లక్ష్యంగా చేసుకుని మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ మాఫియాలా మారిపోతోంది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఆర్‌ఎంపి, పిఎంపిలను లక్ష్యంగా చేసుకుని ఆఫర్లతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ ఆఫర్ల మైకంలో పడిన కొందరు ఆర్‌ఎంపి, పిఎంపిలు అడ్డదారులు తొక్కుతూ అనైతిక వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సామాన్యులు ఆరోగ్యంతో పాటు డబ్బు కూడా నష్టపోతున్నారు.**

### ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

జిల్లాలో మందుల షాపులలో ఎవరైనా నకిలీ మందులు విక్రయించినా ఎంఆర్‌పి కంటే కంటే అధిక రేట్లు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంఆర్‌పి కంటే పది శాతం డిస్కౌంట్ మందులు విక్రయించాలి. నాణ్యతమైన మందులు మాత్రమే అమ్మాలి. ఇంతవరకు అధిక రేట్లు వసూలు చేస్తున్నట్లు తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు. ప్రతి నేలా 40 మందుల షాపులలో తనిఖీలు చేస్తాం. మందులు షాపులకు అనుమతులు తప్పనిసరి లేకపోతే లైసెన్సు రద్దు చేస్తాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మందుల షాపులపై తగిన చర్య తీసుకుంటాం.

**- ఎస్.జయరాములు, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి, అన్నమయ్య జిల్లా, రాయచోటి.**

# ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

**- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు**

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. పెరుగుతున్న విద్యుత్ ట్రూ అఫ్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని, మహిళల ఉచిత బస్సు హామీ అమలు చేయాలని, తల్లికి వందనం అమల్లోకి తీసుకురావాలని, అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని సందీప్ నగర్ దూదేకుల పల్లి చౌడమ్మ గుడి ప్రాంతాల్లో ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించి నవంబర్ 14న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించి వాటికి మౌళిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో ప్రయివేటుపరం చేస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వల్ల వైద్య సేవలు సామాన్య ప్రజలకు భారం అవుతాయని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి హామీలు నేరవర్చాలని తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యం గొంతు నులిమే కేంద్ర ప్రయత్నాలను తెలుగుదేశం బలపర్చడం గర్హనీయమన్నారు. వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసం కేంద్రం తెచ్చిన చట్ట సవరణలను కూడా తెలుగుదేశం బలపర్చడం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇంటింటికి తిరిగి కరపత్రం పంచుతూ ప్రచారం నిర్వహించారు. కలెక్టరేట్ ధర్నాలో జిల్లాలోని ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాధవయ్య, రెడ్డెయ్య పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

# మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పట్టణంలోని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం 14వ వార్డు పరిధిలోని హెచ్‌పి గ్యాస్ వద్ద రూ.11.90 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరుకాగా స్థానిక టిడిపి నాయకులు నాగూర్‌వలి పూలమాలతో అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో మదనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందని అన్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా గుంతలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల మున్సిపాలిటీలో నిధులు ఖాళీ అయ్యాయని విమర్శించారు. నిధులు లేనప్పుడు చైర్ పర్సన్ గానీ, తాము గానీ అభివృద్ధి చేయలేమన్నారు. మదనపల్లి మున్సిపాలిటీ పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి జనరల్ ఫండ్స్, తగినన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతామని తెలిపారు. త్వరలోనే గుంతల రహిత మదనపల్లెని చూస్తామని, అధికారులతో సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, చైర్ పర్సన్ వి.మానూజారెడ్డి, మాజీ కౌన్సిలర్ సాకే లక్ష్మీదేవి, టిడిపి నాయకులు నాగూర్‌వలి, షంషీర్, గిరీష్ కుమార్, బీదం గురునాథ్ యాదవ్, దుబ్బిగాళ్ల భాస్కర్, టెంపర్ రాజేష్, బాబా, మంజునాథ్ పాల్గొన్నారు.

### స్థిర వ్యాపారులు గేటు చెల్లించాల్సిందే

తోపుడు బండ్లపై స్థిరంగా షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకునే వారు మున్సిపల్ గేటు తప్పక చెల్లించాల్సిందేనని ఎమ్మెల్యే షాజహాన్ బాష స్పష్టం చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా మదనపల్లి మున్సిపల్ పరిధిలోని తోపుడు బండ్లు, రైతు ఉత్పత్తుల అమ్మకాలు, బుట్టలపై అమ్ముకునే వారికి మున్సిపల్ శాఖ వసూలు చేస్తున్న రూ.40 గేటును రద్దు చేస్తామని ప్రకటించారు. ఆ ప్రకారమే గత నెల రోజుల క్రితం గేటును రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటిమచారు. తోపుడు బండ్లపై స్థిరంగా షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారస్తులు గేటు చెల్లించాలని వేలం పాటదారులు అడుగుతుండడంతో సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ పేదలు, రైతులు తోపుడు బండ్లు, తలపై బుట్టలు పెట్టుకొని అమ్ముకునే వారికి మాత్రమే గేటు వసూలు మినహాయింపు వస్తుందని, మిగిలిన వారు తప్పక మున్సిపల్ గేటు చెల్లించి సహకరించాలని వ్యాపారస్థులను కోరారు.

అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు లయన్ పి శివారెడ్డి అన్నారు. లండన్‌లో నివాసం ఉండే లోకనాథ్‌రెడ్డి ఆర్థిక సాయంతో శుక్రవారం మదనపల్లి రోడ్డు మార్గంలో గుడిసెలలో నివసించే పేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తమవంతు సహాయం అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటామని అన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్ షేక్ మొహమ్మద్, జిల్లా చైర్మన్ లయన్ వి.హరీష్, చంద్రస్వామి, నందిని ట్రావెల్స్ వినోద్ కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి-పీలేరు :** విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎవిఆర్ పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి రాజీవ్ గాంధీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పీలేరులో మత్తు పదార్థాల కారణంగా ఇద్దరు విద్యార్థులు మరణించడం చాలా బాధాకరమని వారి మృతి పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి ఇకముందు ఎవరూ బలి కాకూడదని కోరుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలి నుంచి మహాత్మగాంధీ కూడలి వరకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ కూడలిలో మానవహారం నిర్వహించి ర్యాలీ ముగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు అఖిల్,డిల్లి బాబు, శివ, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందించాలి

**ప్రజాశక్తి-పీలేరు :** జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ (డివిఎంసి) సభ్యులుగా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని ప్రజాసంఘాల నాయకులన్నారు. జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటిలో సభ్యులుగా నియమితులైన పీలేరుకు చెందిన భారతీయ అంబేద్కర్ సేన (బాస్) జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, ప్రక ృతి వ్యవసాయ నిపుణులు షేక్ బోదేషా వలీలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం జారీ చేసిన డివిఎంసి ఉత్తర్వుల్లో వీరిద్దరికి స్థానం దక్కడాన్ని హర్షిస్తూ వారిని పూలమాలలు, దుస్సాలవులతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీలేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మల్లెల జాకీర్ హుస్సేన్, ప్రజాసంఘాల నాయకులు పఠాన్ మౌలా, షేక్ అమీర్, తుమ్మల ధరణ్ కుమార్, ముల్లంగి కృష్ణయ్య, గుండ్లూరు రవీంద్ర, ఎద్దుల మహేష్ యాదవ్, బుక్కే హరినాయక్, ఆరుమడకల నాగరాజ, సుధా రాణి, భాస్కర్, ఎర్రబల్లి మల్లికార్జున, పల్లి పోగుహరినాథ, షేక్ షాహిన్ షా, బుజ్జు, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## బాధ్యతలు స్వీకరించిన గాయత్రి, శివరామకృష్ణ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా గాయత్రి శ్రీశ్రీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి స్విమ్స్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న గాయత్రి శ్రీశ్రీ బదిలీపై మదనపల్లె సరోజన బోధనాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు ఏలూరు మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా వెళ్లారు. మదనపల్లె మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా ఉన్న జమున ఒంగోలు జిజిహెచ్ సూపరిం టెండెంట్‌గా బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శివరామకృష్ణ ప్రిన్సిపల్‌గా నియ మితులయ్యారు. శుక్రవారం వీరిరువురూ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె సర్వజన బోధనసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా రిఫరల్స్ తగ్గించి ఎక్కువ కేసులను ఇక్కడే పరీక్షించి చికిత్సలు అందిస్తామని తెలిపారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. పేదలు ఇక్కడ అందుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాయత్రి శ్రీశ్రీ

శివరామకృష్ణ

## దళారులను నమ్మి మోసపోవద్దు

**- ఫినో పేమెంట్స్ బ్యాంక్ ప్రతినిధి భాస్కర్**

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

ఫినో పేమెంట్స్ బ్యాంకుతోనే విశ్వసనీయమైన ఆధార్ సేవలు పొందవచ్చునని ఆ సంస్థ ప్రతినిధి భాస్కర్ తెలియజేశారు. కొందరు వ్యక్తులు కక్షపూరితంగా తమపై చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం ఫినో బ్యాంకు సంస్థ ప్రతినిధి భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ఆధార్ కార్డు సేవలను సంస్థ నిర్ణయించిన అతి తక్కువ ధరలకే పొందవచ్చునని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆధార్ సేవలు విస్తృత పరచాలన్న సత్సంకల్పంతో ముందుకొచ్చిన తమ సంస్థ ఎక్కడ ఎటువంటి పొరపక్షాలకు తావు లేకుండా ప్రజలకు విస్తృత సేవలు అందిస్తోందని వివరించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా తమ సంస్థ సంప్రదించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాము అందించే సేవలకు గానూ అధిక ధరల వసూళ్లకు వసూళ్లకు పాల్పడినట్లు ఎవరైనా రుజువు చేస్తే ఎటువంటి చర్యల కైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పనిగట్టుకుని కొందరు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నవారు ఒక్కసారి సంస్థకు వచ్చి సేవలు పొందిన ప్రజలను విచారించుకొని తర్వాత ఆరోపణలు చేయాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం చే గుర్తించబడిన తమ సంస్థ విలువలకు కట్టుబడి ఎల్లప్పుడూ విశ్వసనీయతతో వ్యవహరిస్తుందని, ప్రజలు తమ సంస్థ అందించే ఆధార్, ఇతర సేవలను విరివిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వెలుగు సంస్థకు వ్యాన్ బహూకరించిన దాతలు

## వెలుగు సంస్థకు మినీ వ్యాన్ వితరణ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు స్థానిక అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు సంస్థకు 14 సీట్ల మినీ వ్యాన్‌ను బహూకరించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ కైలాష్ కాంత్, బి.కొత్తకోట మానవత సంస్థ అధ్యక్షులు కృష్ణారెడ్డి శుక్రవారం వెలుగు సంస్థకు విచ్చేశారు. ప్రత్యేక పాఠశాల తరగతి గదులను పరిశీలించన కైలాష్ కాంత్ వారి ప్రత్యేక విద్యాబోధన విధానాన్ని తెలుసుకున్నారు. వెలుగు వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారిచే వెలుగుకు బహుకరింబడిన 14 సీట్స్ వ్యానును రిబ్బన్ కటింగ్ చేసి సంతోషపడ్డారు. ఆ వ్యాన్ ఎక్కి వెలుగు ప్రాంగణంలో కలియ తిరిగారు. ఈ సందర్భంగా వెలుగు సంస్థ ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు 2007 సంవత్సరం నుండి ఎన్నో సహాయ సహకారాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. కైలాష్ కాంత్ మా సంస్థకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులు, వృద్ధుల అవసరార్థం వ్యానును అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కైలాష్ కాంత్ మాట్లాడుతూ నేను ఎన్నో సేవ కార్యక్రమాలు చూశాను గానీ, ఇలాంటి విశిష్టమైన సంస్థ మరెక్కడా లేదని తెలిపారు. ఇందులో భాగంగా కైలాష్ కాంత్, కృష్ణారెడ్డిలను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి, సోషల్ వర్కర్ గీత, వార్డెన్ స్వీటీ, సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

## 'ఆదిత్య'లో నైపుణ్య సదస్సు

**ప్రజాశక్తి-మదనపల్లి**

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల నైపుణ్య సదస్సు ఆంటీన్న డిసైన్ యూసింగ్ హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎ డిఎస్ మీద నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామ లింగారెడ్డి మాట్లాడుతూ ఆంటినా డిజైన్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.బుజ్జి బాబు మాట్లాడుతూ మైక్రోస్ట్రిప్ ఆంటిన్నాస్ ఇన్5 గ్రా కమ్యూనికేషన్స్ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్లు డాక్టర్ కె.వి.వరప్రసాద్ డాక్టర్ పి.గంగాధర రెడ్డి, అధ్యాపక బృందం, ఇసిఇ విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యఅతిథి బుజ్జిబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రిన్సిపల్ సతీష్‌బాబు

# విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరం

**- అనంతపురం జెఎన్‌టియు విసి సుదర్శనరావు**

**ప్రజాశక్తి-మదనపల్లి**

విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మిట్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మిట్స్ కుటుంబంలోని సరికొత్త సభ్యులకు స్వాగతం పలుకుతూ 2024 ఫ్రెషర్స్ డేని ఎంతో ఉత్సాహంగా కళాశాల విద్యార్థులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతపురం జెఎన్‌టియుఎ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు పాల్గొన్నారు. ముందుగా ముఖ్య అతిథితో పాటు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాథ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, మొదటి సంవత్సర విద్యార్థుల కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రమోహన్ జ్యోతి ప్రజ్వలనతో కార్యకమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుదర్శనరావు మాట్లాడుతూ విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమని జీవితంలో స్వీయక్రమశిక్షణ అనేది విద్యార్థుల విజయానికి మూలస్తంభాలలో ఒకటన్నారు. భవిష్యత్తు మల్టీ డిసిప్లినరీ ఇంజినీరింగ్ అని పేర్కొన్నారు. కాన్సెప్చువల్ లెర్నింగ్ చాలా అవసరమని, విషయాన్నీ బట్టీ కొట్టడం తప్పన్నారు. ఆన్‌లైన్‌లో వీడియో లెక్చర్ ద్వార ఆ కాన్సెప్ట్‌ను మరింత లోతుగా అధ్యనం చేయాలని తెలిపారు. మంచి అధ్యాపకులు మిట్స్ కళాశాలలో ఉన్నారని, వారిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి మంచి విషన్ ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్‌పై ధ్రుష్టి పెట్టాలన్నారు. విజయ భాస్కర్ చౌదరి మాట్లాడుతూ తమ విలువైన సమయాన్ని తమ విద్యార్థులకు కేటాయించి ఎంతో విలువైన సమాచారాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. మనదేశంలో సంవత్సరానికి కోటి మంది గ్రాడ్యుయేట్స్ బయటకు వస్తున్నారు. కానీ కనీసం 25 లక్షల మందికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించలేని పరిస్థితి ఈ రోజు ఉంది. మిగతా 75 లక్షల మంది ఏమిచేయాలో ఆలోచించే పరిస్థితి, మన భవిష్యత్తు ఏమి అని ఆలోచించాలన్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాల ల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుగా ఉన్నాయని తెలిపారు. వాటిని ఉపయోగించడం, నూతన ఆలోచనలతో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఇతర గ్రాడ్యుయేట్స్‌కు ఉద్యోగ కల్పించడం వంటి ఆలోచనలు విద్యార్థులకు ఉండాలని, మా కళాశాల విద్యార్థులకు ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. విదేశాలలో ఎన్నో పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు ఇంటెర్న్‌షిప్‌లు ఆఫర్ చేస్తున్నాయని చెప్పారు. సకాలంలో వాటిని సద్వినియోగ చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు వారి బి.టెక్ లో కనీసం 3 ఇంటెర్న్‌షిప్ లు చేయాలనీ ఆయన అన్నారు. ఇవి వారి కెరీర్ కు ఉపయోగపడతాయని, అంతే కాకుండా విదేశీ భాష చాలా ఉపయోగపడుతుందనీ, వాటిని నేర్చుకోవాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులు ఎంతో మంది పరిశోధనలలోను, నూతన ఆవిష్కరణలోనూ, టెక్నాలజీ డెవలప్మెంట్‌లో, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఆ స్థాయికి ఎదగాలని సూచించారు. ఫ్రెషర్స్ డే కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ఆట పాటలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అనంతపురం జెఎన్‌టియు విసి సుదర్శనరావు

చిరుత దాడిలో మృతి చెందిన మేకను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, స్థానికులు

## చిరుత దాడిలో మేక మృతి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

చిరుత పులి దాడిలో మేక మృతి చెందిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లెకు చెందిన పి.రామయ్య రోజువారి లాగానే గురు వారం కూడా తనకున్న మేకలను మేత కోసం ఊరికి సమీపంలోని చిడతనగుట్ట కొండ ప్రాంతానికి తోలుకొని వెళ్లారన్నారు. మేత మేపుకొని సాయంత్రం ఇంటికి రాగా ఒక మేక కనిపించలేదని గుర్తించి, శుక్రవారం ఉదయం మేక కోసం వెతకగా చిడతనగుట్టలో మేక చిరుత దాడిలో మృతి చెందినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. వెంటనే తవళం బీట్ అటవీ శాఖ అధికారి దీపకు తెలియ జేశామని తెలిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారిసంఘటనా స్థలానికి స్థానికులతో కలిసి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. వన్యప్రాణుల వల్ల నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వం తగిన విధంగా ఆర్థిక సాయం అందిస్తూ, రైతులను ఆదుకుంటుందని తెలిపారు.చిరుత సంచారంపై ప్రజలు భయభ్రాంతులకు గురి కావద్దని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిరుత సంచారాన్ని స్థానికుల సహాయంతో అటవీశాఖ అధికారులు గమనిస్తున్నారని, చిరుతను దారి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతానికి సమీపంలో రాత్రి వేళల్లో మేకలు, గొర్రెలను, ఆవులను ఉంచరాదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణ, ఎంపిటిసి వెంకటరమణ, రాజగోపాల్, స్థానికులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుచే శాశ్వత సభ్యత్వం : కెకె

**ప్రజాశక్తి-చిట్వేలి:** ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నట్లు చిట్వేలి టిడిపి మండల అధ్యక్షుడు, రాష్ట్ర తెలుగు యువత ఉపా ధ్యక్షులు కెకె చౌదరి తెలిపారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో సిఎం చేతుల మీదుగా లక్ష రూపాయలు చెల్లించి శాశ్వతసభ్యత్వం పొందినట్లు చెప్పారు. కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ టిడిపి అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా తీసుకొచ్చిన తొలి పార్టీ టిడిపి అని, గతంలో టిడిపి సభ్యత్వం తీసుకుంటే రెండు లక్షలు ఉండే ప్రమాద బీమాను ఇప్పుడు ఐదు లక్షలకుపెంచి కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించారని పేర్కొన్నారు. సభ్యత్వం ద్వారా వచ్చిన నగదును కార్యకర్తల సంక్షేమానికి ఉపయోగిస్తారని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ భాగ్యలత

## ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం

**ప్రజాశక్తి-గాలివీడు**

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని తహశీల్దార్ జె. భాగ్యలత పేర్కొన్నారు.శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎక్కడ ఆక్రమణ గురి కాకుండా చూస్తామని ఎవరికైనా రైతులు, ప్రజలకు భూ సమస్యలుంటే మధ్యవర్తులు, దళారులను నమ్మకుండా తమ దగ్గరికి వస్తే సమస్య పరిష్కరించి న్యాయం చేస్తామని అన్నారు. ఏమైన ఇబ్బందులు ఉంటే జిల్లా అధికారులతో చర్చించి మీ సమస్య పరిష్కరించ డానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ స్థలం ఎక్కడ ఆక్రమించినా, ఎవరైనా స్థలాన్ని కబ్జా చేసినా అటువంటి వారి సమాచారం అందిస్తే వారి పేరు గోప్యంగా ఉంచుతామని, ప్రభుత్వ స్థలం ఎక్కడుంటే అక్కడ బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అధికారులకు ప్రజలు కూడా సహకారం అందించాలని తెలిపారు.కార్యక్రమంలో డిటి శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ బాలాజీ, విఆర్ఒ అల్లాబకాష్ పాల్గొన్నారు.

## నేటి నుంచి మగ్దూం బాబా ఉరుసు

**ప్రజాశక్తి-నందలూరు:** నందలూరు గ్రామ పంచాయతీలో వెలసిన మగ్దూంబాబా దర్గాలో శనివారం నుంచి 12వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠాధిపతి హైదర్ సాహెబ్ తెలిపారు. 9న నిసాన్, 10న గంధం, 11న ఉరుసు, 12 న జియరాత్ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు తెలిపారు. ఉరుసు ఉత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు.

## సిహెచ్‌సి వైద్యాధికారిగా తేజస్వి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి :** తంబళ్లపల్లె వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్‌గా గైనకాలజిస్ట్ డాక్టర్ తేజస్వి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహచర డాక్టర్లు, వైద్య సిబ్బంది, ప్రజల సహకారంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. అందరి సహకారంతో ఆస్పత్రి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఇక్కడ గతంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ వెంకటరామయ్యను డిప్యూటేషన్‌పై బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ చేశారు.

## అన్యాంక్రాంతమైన భూమిని పరిశీలించిన అధికారులు

### -వచ్చే వారం బహిరంగ వేలం పాట

**ప్రజాశక్తి - రామసముద్రం :** మండలంలోని కురిజల పంచాయతీ చెన్నరాయస్వామి ఆలయానికి సంబంధించిన దేవదాయ శాఖ భూమి దాదాపు 2 ఎకరాల 11 సెంట్లు భూమిని కురిజల గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు 35 సంవత్సరాలుగా దేవాదాయశాఖ భూమికి ఎటువంటి రొక్కం చెల్లించకుండా సాగు చేసుకుని అనుబవిస్తున్నారని ఇఒ రమణారెడ్డి తెలిపారు. ఈ విషయంపై గత వారం రోజులుగా గ్రామంలో గొడవలు పడుతుండటంతో గ్రామస్తులు ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఎఒ రమణారెడ్డి, ఇన్స్‌పెక్టర్ శశికుమార్, డిప్యూటీ తహశీల్దార్ నారాయణ రెడ్డి, విఆర్ఒ రెహమాన్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఎఎస్ఐ చలపతి, సిబ్బంది కలిసి చెన్నరాయస్వామి ఆలయ భూమిని సమీక్షించి,గ్రామస్తుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ రమణారెడ్డి మాట్లాడుతూ చెన్నరాయస్వామి ఆలయానికి సంబంధించి 2 ఎకరాల 11 సెంట్లు భూమిని దాదాపు 35 సంవత్సరాల నుండి ప్రభుత్వానికి ఎటువంటి రొక్కము చెల్లించకుండా ఒకే కుటుంబం వారు సాగు చేసుకుంటున్నారని అన్నారు. గ్రామస్తుల సమక్షంలో వారి ఆధీనంలో ఉన్న భూమిని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకొని, త్వరలో ఈ భూమిని సాగు చేసుకు నేందుకు గ్రామస్తుల మధ్య బహిరంగ వేలం వేయ నున్నట్లు తెలిపారు. శిథిలా వస్థకు చేరుకున్న చెన్నరాజస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ పునర్నిర్మాణానికి త్వరలోనే చర్యలు తీసుకొని పూర్తి చేస్తామని అన్నారు. అర్చకులను ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు కొనసాగించి, గ్రామస్తులకు ఆ స్వామివారి దర్శన భాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జడ్‌పిటిసిలు మునివెంకటస్వామి, సి. నాగరాజ, రెడ్డెప్ప, వై. నాగరాజ పాల్గొన్నారు.

**NAME CHANGE**

I, ULENIKUNTA BABA FAQRUDDIN, S/o, Shaik Hussain Saheb, R/o. 1/7, Kaspa, Thumukunta, Annamayya Dist. A.P., Declare that I have Changed My Name as ULENIKUNTA BABA FAKRUDDIN.

**NAME CHANGE**

I, ULENIKUNTA SHAKIRUN, W/o Ulenikunta Baba Fakruddin, R/o. 1/7, Kaspa, Thumukunta, Annamayya Dist. A.P., Declare that I have Changed My Name as ULENIKUNTA SHAKIRUN.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

- ప్రతి పంచాయతీని అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి నరసింహులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి డి.నరసింహులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైస్ ఎంపిపిలు కే.సుజాత, జయప్రకాశ్ రెడ్డి, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ ధనంజయులు స్థానిక ఎంపిటిసిలు, సర్పంచ్‌లతో కలిసి హాజరై వివిధ శాఖల త్రైమాసిక ప్రగతిని సమీక్షించారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చి, తక్షణం పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి ట్యాంకర్లను బ్లీచింగ్ తో శుభ్రపరచాలన్నారు. మరుగునీటి కాలువలను, చెత్తాచెదారాన్ని వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని అన్నారు. రీ సర్వే పై ప్రజలకు ఉన్న సమస్యలపై గ్రామ సభలను నిర్వహించి ప్రజల ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించడానికి చర్యలు చేపట్టామన్నారు. సర్పంచ్‌ల అభ్యర్థన మేరకు ప్రతి పంచాయతీలోనూ శ్మశాన వాటికలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు అందేలా చూడాలన్నారు. ఈ ఏడాదిలో సుమారు 70 లక్షల రూపాయలతో ప్రతి పంచాయతీలోను మౌలిక వసతులను ఏర్పాటు చేయడానికి కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం పై వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఇటీవల పంచాయతీలలో కుక్కల బెడద ఎక్కువైందని, తరచు కుక్కల కాటుకు ప్రజలు, చిన్నపిల్లలు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ అధికారులు వెంటనే కుక్కల బెడదను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎఒ రమేష్ బాబు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ ప్రత్యూష, సిడిఎఒ సుజాత, ఎంఇఒనారాయణ, ఎపిఒ రమేష్, డాక్టర్ సురేష్, సర్పంచులు సుబ్రమణ్యం, మహదేవ రెడ్డి, శ్రీవాణి నవీన్, రెడ్డప్ప, పాపులమ్మ మల్లప్ప, ఎంపిటిసిసభ్యులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి ధ్యేయంగా పనిచేయండి

**ప్రజాశక్తిపుల్లంపేట :** మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వాలు, పదవులు శాశ్వతం కాదని మండల అభివృద్ధి తమ ధ్యేయమని మండల అధికారులకు తెలిపారు. విద్యుత్, తాగునీరు సంబంధించి మండలంలో సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. తాగునీటి విషయంలో ఇప్పటికే మండల వ్యాప్తంగా 35 లక్షల రూపాయలు మండల గ్రాండ్‌లో ఇవ్వడం జరిగిందని తెలిపారు. మండల వ్యాప్తంగా 54 దొంగ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఒక సర్వే నెంబర్ కు బదులు మరొక సర్వే నెంబర్లు చట్టానికి విరుద్ధంగా విద్యుత్ అధికారులు బిగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సెంట్లు కలిగిన వ్యక్తికి కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మండల వ్యాప్తంగా 42 గ్రామాలకు శ్మశానవాటిలను అందుబాటులోకి తీసుకవచ్చినట్లు తెలిపారు. అనంతసముద్రం సర్వేనెంబర్ 139లో 2.77 సెంట్లు ఎస్‌సిలకు చెందిన భూమిని అగ్రవర్ణాల వారు ఆక్రమించుకోవడం ఏంటని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. అనంతరం అంగన్వాడి డిప్యూటీ సిడిఎఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 25 అంగన్వాడీ సెంటర్లకు మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు అయ్యాయని మరుగుదొడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారి సుధీష్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సిబ్బంది కొరతగా ఉన్నా కూడా ఉన్న సిబ్బందిని ప్రజా పరిషత్ అధికారులు వినియోగించుకోవడం వల్ల పశుసంవర్ధక శాఖలో పనులు చేయడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఎంపిడిఒ జయశ్రీ మాట్లాడుతూ విద్యా శాఖలో అపార్ యూనిక్ కార్డ్ సర్వేలో మండలాన్ని ప్రథమ స్థానంలోకి తీసుకువచ్చిన మండల విద్యాశాఖ అధికారులకు ఎంపిడిఒ ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జయ శ్రీ, వైస్ ఎంపిపి జైశంకర్‌నా యుడు, భోగ వెంకటసుబ్బమ్మ, ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, ఎంఇఒలు నాగా తిరుమలరావు, చక్రధర్‌రాజు, మండల అగ్రికల్చరల్ అధికారి శ్రీకర్, వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌చంద్ర, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ ఎఇలు, అంగన్వాడీ సూపర్వైజర్లు జయలక్ష్మి, నిర్మలాదేవి, మణెమ్మ, మండల పరిధిలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది అటవీ శాఖ సిబ్బంది పాల్గొనడం జరిగింది. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా కొందరులు మండల అధికారులు , సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొనకపోవడం గమనార్హం.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి బాబుల్‌రెడ్డి

# ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపిడిఒ

పక్కాగృహాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇ

**ప్రజాశక్తి- కలకడ**

ఇంటి నిర్మాణాలను పూర్తి చేయకుంటే వాటిని తొలగించి వేరే వారికి ఇవ్వడం జరుగుతుందని ఎంపిడిఒ అబ్దుల్ రహీం లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కోన పంచాయతీ బంగారు వాండ్లపల్లి, కలకడ, బాలయ్యగారిపల్లి పంచాయతీలలో గతంలో మంజూరైన జగ నన్న కాలనీలలో ఇండ్ల నిర్మాణాలను పూర్తిస్థాయిలో నిర్మించలేదని అన్నారు. వాటిని నిర్మించకుంటే ఇల్లు లేని వేరే వారికి మంజూరు చేయడం జరుగు తుందని గుర్తు చేశారు. ఈ క్రమంలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇళ్లు లేని వారు దరఖాస్తులు చేసుకుంటున్నారని ఆ జాబితా మండల హౌసింగ్ కార్యాలయానికి పంపడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా మండలంలో పక్కాగృహం మంజూరై పునాదుల వరకే కట్టుకుని ఉంటే వారి ఇంటిని రద్దుపరిచి గ్రీవెన్స్‌డేలో దరఖాస్తు చేసుకున్న వారికి ఆ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని కలకడ, బాలయ్యగారిపల్లి, కోన పంచాయతీలలో పునాదుల వరకే నిర్మించి ఉన్న ఇళ్ళను పూర్తి చేయకుంటే రద్దు చేస్తామని తెలిపారు. ఒక్కో ఇంటికి ఆన్‌లైన్‌లో ఐడి వచ్చిన వెంటనే వారికి గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి ఎంత సొమ్ము ఇచ్చారో అంతే వస్తుందని ఈ ప్రభుత్వంలో పెంచిన సొమ్ము రాదని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించాలని సూచించారు. అలాకాకుండా మేము పునాదులు వేసాములే మా ఇల్లు ఎక్కడికి పోదు అనుకుంటే పొరబడినట్లునని అన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాగమణినాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు చరిష్మాంజలి, సమరసింహారెడ్డి, లక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

## ఎమ్మెల్యే 'పెద్దిరెడ్డి' విస్తృత పర్యటన

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. కురబలకోట మండలం, దాదంవారిపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న నల్లతిమ్మారెడ్డి గారి శివారెడ్డిని స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలతో కలసి పరామర్శించారు.అనంతరం బి.కొత్తకోట మండలంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్య కర్త లకు అండగా ఉంటామన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరిట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. హామీలు అమలు చేయకుండా ప్రతిపక్షంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. నియోజక వర్గంలో అభివృద్ధి పనులను యధావిధిగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి : పీడీ

**ప్రజాశక్తి-గాలివీడు :** మండలంలోని 17 గ్రామాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులలో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ టి.వెంకటరత్నం పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో రివ్యూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీకి వందరోజుల పని దినాలు కల్పించాలని పనుల వద్ద మస్టర్లను తనిఖీ చేస్తూ ఉండాలని అన్నారు. ఉపాధి హామీ పనులలో ఎక్కడ అవినీతి జరగకుండా పక్షపాతం లేకుండా కూలీలకు పని కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఒలు రామచంద్రయ్య, హరిప్రసాద్, ఇసి బాలాజీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ

## నేడు చిన్నమండెం మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-చిన్నమండెం :** చిన్నమండెం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ దివ్య తెలిపారు.ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజలకు కల్పించాల్సిన మౌలిక వసతులు గురించి, ఉపాధి హామీ గురించి, గృహ నిర్మాణం గురించి, తాగునీటి విషయం గురించి, చర్చిస్తారని తెలిపారు.

## సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోండి : ఎపిఎం

**ప్రజాశక్తి-కలికిరి**

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకో వాలని ఎపిఎం దేవసేన ప్రజలను కోరారు. ఈ సందర్భ ంగా ఆమె మాట్లా డుతూ జిల్లాలోని డిఆర్‌డిఎ వెలుగు కార్య క్రమంలో భాగంగా అర్హత కలిగిన 48 మంది ఎస్‌సి, ఎస్‌టి సంఘ సభ్యులకు జీవనోపాదులు కల్పించుటకు ప్రధానమంత్రి అను సుజిత్ జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా మూడు లక్షల వరకు గరిష్టంగా 50 వేల వరకు సబ్సిబీతో రుణాలు ఇస్తుందని తెలిపారు. పదిశాతం వాటా ధనంతో జీవనోపదులకు రుణాలు మంజూరు చేయబడునని చెప్పారు. నర్సరీ మొక్కల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, కూరగాయల పెంపకం, మిర్చి, చింతపండు, వేప పిండి, కోడిపెంట, వానపాముల తయారీ, ఎన్‌పిఎం షాప్ విత్తనాల తయారీకి రుణ సదుపాయం పొందవచ్చని అన్నారు. సేవారంగానికి సంబంధించి ఆటో రిక్షా, ఫోటో స్టూడియో, ట్రావెల్స్ ఏజెన్సీ, కంప్యూటర్ నెట్ సెంటర్, జిరాక్స్ సెంటర్, బ్యూటీ పార్లర్, బ్యాండ్ ఆర్కెస్ట్రా, టైలరింగ్ వంటి వాటికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సూక్ష్మ వ్యాపారం వారు పిట్టి షాప్స్, కిరాణా షాప్, పూల వ్యాపారం, చెప్పుల దుకాణం, చింతపండు, ఫ్యాన్సీ స్టోర్, చీరలు, గాజులు, అల్పాహార సంబంధిత వ్యాపారం, ఐస్ క్రీమ్, జ్యూస్, కూల్ చిన్న తరహా పరిశ్రమలు అనగా కంప్యూటర్, ఎంబ్రాయిడరీ, పేపర్ ప్లేట్స్, కొబ్బరి పీచు ఉత్పత్తులు, వాటర్ ప్లాంట్స్, కుండల తయారీ, కారం పిండి మరలు, పిండి వంటలు, పచ్చళ్ళ తయారీ వంటి రుణాలు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇంకా పూర్తి వివరాల కొరకు ఆయా మండల ఎపిఎం వెలుగు ఆఫీసులో సంప్రదించగలరని తెలి పారు. జిల్లాలోని ఎస్‌సి సంఘ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 11న దరఖాస్తుకు చివరి తేదీని తెలిపారు.

## బ్రూసెల్లా వ్యాధిని నియంత్రించాలి

**ప్రజాశక్తి-చిన్నమండెం :** పేయదూడలకు సంక్రమిత బ్రూసెల్లా వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.గుణశేఖర్ పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ వారు ప్రతి సంవత్సరం బ్రూసిల్లా వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల నుంచి 8 నెలల వయస్సు గల పేయ దూడలకు బృసిల్లా ఎస్ 19 లైవ్ వ్యాక్సిన్‌ను వేస్తున్నట్లు ఏర్కొన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు బి.రాజశేఖర్, రాష్ట్రస్థాయి వ్యాధి నిర్ధారణ ప్రయోగ శాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్ .తనూజ, స్థానిక సహాయ సంచాలకులు డాక్టర్ టి శ్రీధర్‌రెడ్డి, పశువైద్యాధికారులు గణేష్ మాధవి, రవికుమార్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సిడిపిఒ సుజాత

## పోషకాహారం తప్పకుండా అందించాలి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

అంగన్వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని సిడిపిఒ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో దిగువపల్లె, నిమ్మనపల్లె, గంగాపురం పల్లెలోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని తెలిపారు. ప్రీ స్కూల్ విద్యార్థులుగా నమోదైన విద్యార్థుల హాజరు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు ప్రతిరోజూ విధులకు హాజరవుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత పరిశుభ్రంగా ఉంచడానికి ప్రభుత్వం తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాను లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ సభ్యత్వంలో భాగస్వాములు కావాలి : 'చమర్తి'

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

టిడిపి సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వారిని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులుగా చేర్పించాలని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు టిడిపి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం స్థానిక పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సభ్యత్వ నమోదు పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ పార్టీకి లేనంత కార్యకర్తల అండదండ ఉన్న పార్టీ టిడిపినేనని అన్నారు. అలాంటి పార్టీలో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమాతో పాటు అనేకమంది నాయకులు, కార్యకర్తల అండదండలు ప్రతి టిడిపి కుటుంబ సభ్యులకు దక్కుతాయని తెలిపారు. ఇదే విషయాన్ని ప్రతి ఇంటికి తీసుకువెళ్లి రాజంపేట వ్యాప్తంగా భారీ ఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, భానుగోపాల్‌రాజు, మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పసుపులేటి ప్రవీణ్ కుమార్, కొల్లి రెడ్డయ్య, పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబుబకర్, మైనారిటీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్.కె కరీమ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

# క్రైం కార్నర్

## గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతులకు గాయాలు

**ప్రజాశక్తి-ములకలచెరువు**

ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లడంతో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడినట్లు మూలకలచెరువు పోలీసులు తెలిపారు. ఎస్ఐ గాయత్రి కథనం మేరకు..తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లి పంచాయతీ, బందార్లపల్లికు చెందిన రైతు ఆంజనేయులు రెడ్డి, కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ, పరదేశి పల్లెకు చెందిన మరో రైతు పాపిరెడ్డి బైక్‌లో కర్ణాటకలోని చింతామణిలో కూరగాయల విత్తనాలు కొనుక్కుని రావడానికి బయలు దేరారని తెలిపారు. స్కూటర్ మార్గమధ్యంలోని, ములకలచెరువు మండలం, బురకాయలకోట సమీపానికి రాగానే ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయిందని అన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరి రైతులను 108లో చికిత్సల నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి ఇద్దరికీ మెరుగైన వైద్య చికిత్సలు అందించారని అన్నారు. ఆంజనేయులురెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ల సలహా మేరకు మదనపల్లి నుంచి తిరుపతి రుయా ఆసుపత్రికి తరించినట్లు తెలిపారు. పాపిరెడ్డి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జింకల గుంపు అడ్డుపడడంతో దంపతులకు..

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

జింకలగుంపు బైకు మీదకు రావడంతో బైక్ అదుపు తప్పి పడడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. మొలకలచెరువు ఎస్ఐ గాయత్రి తెలిపిన కథనం మేరకు.. మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ, నాయునివారి పల్లెకు చెందిన గంగులప్ప, సుకన్య దంపతులు శుక్రవారం ద్విచక్ర వాహనంలో వేపూరికోటకు బయల్దేరారు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలు దేరుతుండగా మార్గ మధ్యంలోని మొలకల చెరువు-పిటిఎం రోడ్డులోని టిటిడి కల్యాణ మండపం వద్ద జింకల గుంపు వచ్చి బైక్‌పై పడడంతో అదుపుతప్పి కిందపడి దంపతులిద్దరూ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను కుటుంబీకులు మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి మండలం సిటిఎం గ్రామం, మిట్టపల్లికు చెందిననారాయణ(55) సిటిఎంలో షామియానా, సప్లయర్స్ నిర్వహించుకుంటూ జీవనం సాగించేవాడని తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఇంటివద్దనే పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారని అన్నారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి-పీలేరు**

రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం తిరుపతి-గుంతకల్లు వెళ్లే రైలు ఓ మృతదేహాన్ని ఈడ్చుకుంటూ పీలేరు పట్టణం, మదనపల్లె మార్గంలోని రైల్వే గేటు సమీపంలో జారవిడిచింది. ఈ ప్రమాదం పద్మావతీనగర్-కట్టుకాలువ వీధి మధ్య రైల్వే ట్రాక్ పై జరిగినట్టు రైల్వే పోలీసులు నిర్ధారించారు. వృద్ధుడు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగిందా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో విచారణ చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలియజేశారు. వృద్ధుడి మృతదేహం గుర్తుపట్టడానికి కూడా వీలు లేని స్థితిలో ఉందని, ఈ మేరకు కేసు నమోదుచేసి వృద్ధుడి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.